క్లుప్తంగా

వైభవంగా కనకదుర్గ విగ్రహ ప్రతిష్ఠ వార్షికోత్సవం

రాజానగరం: చక్రద్వారబంధం దేవీచౌక్ వద్ద కనకదుర్గ అమ్మవారి ప్రతిష్ఠ వార్షికోత్సవం వైభవంగా నిర్వహించారు. ప్రతిష్ఠ జరిగిన 18 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శనివారం చండీ హోమం నిర్వహించి, పూర్ణాహుతిని సమర్పించారు. భక్తులు పంచామృతాలతో అభిషేకాలు చేశారు. అదే సమయంలో అక్కడే కొలువైన మృత్యుంజయ స్వామికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం భక్తులకు అన్నసమారాధన ఏర్పాటు చేశారు.

కోటి దత్తసాయి ధ్యాన మందిరానికి శంకుస్థాపన

మధురపూడి: కోరుకొండ మండలం కోటి గ్రామంలో శనివారం దత్తసాయి ధ్యాన మందిరానికి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన బీజేపీ నాయకులు, విశ్వహిందూ ధర్మపరిరక్షణ రామసేన అధ్యక్షుడు కంబాల శ్రీనివాసరావు పాల్గొని మాట్లాడుతూ దత్తసాయి ధ్యాన మందిరం నిర్మాణానికి సహకారాన్ని అందిస్తామన్నారు. పురాతన దేవాలయాలు, ధ్యాన మందిరాల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

దేశ రాజధానిలో బీజేపీ చారిత్రక విజయం

సీతానగరం: దేశ రాజధాని ఢిల్లీలో భారతీయ జనతా పార్టీ చారిత్రక విజయం సాధించిందని రాజానగరం నియోజకవర్గం బీజేపీ కన్వీనర్ నీరుకొండ వీరన్న చౌదరి అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఢిల్లీ అభివృద్ధికి, దేశ రాజధానిలోని ప్రజల శ్రేయస్సు, సంక్షేమం కోసం వికసిత సంకల్ప పత్రం ద్వారా బీజేపీ ఇచ్చిన హామీలు ప్రజల మెప్పు పొందాయన్నారు. దేశ ప్రధాని నరేంద్ర మోదీపై ఢిల్లీ ప్రజలు ఉంచిన విశ్వాసానికి ప్రతీక అక్కడ ఘన విజయమన్నారు. 27 ఏళ్ల తరువాత అధికారంలోకి రావడం బీజేపీపై ప్రజల నమ్మకానికి విజయం నిదర్శనమన్నారు. ఢిల్లీ ప్రజలు నిర్ణయం కొనియాడదగినదని వీరన్న చౌదరి హర్షం వ్యక్తం చేశారు.

ఇంటర్ విద్యార్థుల సందడి

రాజానగరం: స్థానిక దివ్య జూనియర్ కళాశాల విద్యార్థులు శనివారం ఫేర్‌వెల్ కార్యక్రమం నిర్వహించారు. రాబోయే పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలను సాధించి, భవిష్యత్తుకు బంగారు బాట వేసుకోవాలని, జీవితంలో ఉన్నతస్థాయికి చేరుకునేలా మీ పయనం సాగాలనే ఆకాంక్షను కళాశాల వైస్ చైర్మన్ బర్ల విజయ్‌తోపాటు పలువురు వక్తలు వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఆడుతూ, పాడుతూ సందడి చేశారు.

బీజేపీ శ్రేణుల సంబరాలు

రాజానగరం: దేశ రాజధాని ఢిల్లీలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించడాన్ని నియోజకవర్గంలో శనివారం పలుచోట్ల ఆ పార్టీ శ్రేణులు బాణ సంచా కాలుస్తూ, స్వీట్లు పంచుతూ సంబరాలుగా చేసుకున్నారు. మండలంలోని వెలుగుబందలో మండల కమిటీ అధ్యక్షుడు ఆళ్ల శివనాగరాజు ఆధ్వర్యంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కేక్ కట్ చేసి, స్వీట్లు పంచారు. లాలాచెరువు హౌసింగ్ బోర్డు కాలనీలో బొమ్ముల సతీష్ ఆధ్వర్యంలో మిఠాయిలు పంచారు.

బీజేపీ విజయం పట్ల పార్టీ శ్రేణుల హర్షం

పెదపూడి: ఢిల్లీలోని అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో బీజేపీ విజయం సాధించడం పట్ల ఆ పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేశారు. పెదపూడి మార్కెట్ సెంటర్‌లో శనివారం ఆ పార్టీ నాయకులు కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. నియోజకవర్గ కో కన్వీనర్ మురమళ్ల వెంకటరమణ, మండల కన్వీనర్ ముమ్మిడిశివ, పార్టీ నాయకులు కాకి సత్యనారాయణ, తోటకూర వెంకటేశ్వరరావు, గుణ్ణం రామాంజనేయులు, మేడపాటి వర ప్రసాద్‌రెడ్డి, శ్రీధర్, గోవిందు తదితరులు పాల్గొన్నారు.

శివాలయం నిర్మాణానికి భూమిపూజ

బిక్కవోలు: మండలంలోని బలభద్రపురం గ్రామంలోని శివాలయం నిర్మాణానికి గ్రామానికి చెందిన నల్లమిల్లి సుబ్బారెడ్డి, మానసావతి దంపతులు భూమి పూజ చేశారు. తూర్పు తిరుమలగా పేరు గాంచిన ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయానికి అనుబంధంగా ఈ శివాలయం నిర్మిస్తున్నారు. సుమారు రూ.60 లక్షలతో నిర్మిస్తున్న ఈ శివాలయంలో ద్వాదశ లింగాలు, అష్టాదశ పీఠాలు, అమ్మవారి శ్రీ చక్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలోని భక్తులు విశేషంగా పాల్గొన్నారు. అన్న సమారధన నిర్వహించారు. కార్యక్రమంలో నల్లమిల్లి రామచంద్రారెడ్డి(రాము), కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

15న వేంకటేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠ

రాజానగరం: చక్రద్వారబంధంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో వేంకటేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం ఈనెల 15న నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఉదయం 10.54 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి, జయ, విజయ, గరుడ అళ్వార్, విష్వక్సేనుడు, వరాహ స్వామి విగ్రహాలను ప్రతిష్ఠించనున్నారు. శిఖర, యంత్ర రాజ సహిత ధ్వజ స్తంభ ప్రతిష్ఠోత్సవాలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. అనంతరం అన్న సమారాధన నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా విగ్రహాలను గ్రామాల్లో ఊరేగించారు.13న గణపతి పూజతో ప్రతిష్ఠ కార్యక్రమాలు ప్రారంభం కానున్నాయి. సుమారు రూ. కోటి వ్యయంతో నిర్మించిన ఈ ఆలయ నిర్మాణానికి టీటీడీ నుంచి రూ.10 లక్షల నిధులు మంజూరయ్యాయి.

మైనర్లకు వాహనం.. పొంచి ఉన్న ప్రమాదం

- ఒకే వాహనంపై ముగ్గురు లేదా నలుగురు వెళుతూ విన్యాసాలు
- ప్రాణం మీదకు తెచ్చుకుంటున్న బాలలు
- గత నెలలో బైక్ నడుపుతూ బాలుడి మృతి
- చోద్యం చూస్తున్న పోలీసులు



సీతానగరం: నిండా పదిహేను ఏళ్లు నిండని మైనర్లు... ఆపై ద్విచక్ర వాహనం ఎక్కారు. ఒకరు కాదు ఏకంగా నలుగురు స్కూటర్‌పై షికారు చేస్తూ విన్యాసాలు చేస్తారు. సీతానగరం మండలం పరిధిలోని గ్రామాల్లో ఈ దృశ్యాలు ప్రతి నిత్యం కనిపిస్తుంటాయి. పెద్ద శబ్దాలు చేసే సైలెన్సర్లతో అతి వేగంగా వాహనాలు నడుపుతూ ప్రమాదాలు కొని తెచ్చుకుంటున్నారు. సింగవరానికి చెందిన ఎనిమిదవ తరగతి చదువుతున్న చీకట్ల అఖిల్ (13) గత నెల 22న రామచంద్రపురం జగనన్న కాలనీలోని బంధువుల ఇంటికి స్కూటర్‌పై వెళుతుండగా మోటారు సైకిళ్లు ఎదురెదురుగా ఢీకొట్టుకోవడంతో తలకు తీవ్ర గాయంతో కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఇలా మైనర్లు మోటారు సైకిళ్లు నడిపి ప్రమాదాలకు గురవుతున్నారు.

శబ్దాలు చేసే సైలెన్సర్లతో హల్‌చల్

కొంతమంది అకతాయి మైనర్లు గ్రామాల్లో, కళాశాలల వద్ద పెద్ద శబ్దాలు చేసేలా సైలెన్సర్లతో హల్‌చల్ చేస్తూ ద్విచక్ర వాహనాలను వేగంగా నడుతున్నారు. దీనితో ఒక్కోసారి ప్రమాదాలకు గురవుతున్నారు. వీరి వేగానికి అటుగా వచ్చే జనం ప్రమాదాలకు గురవుతున్నారు. ఇలా ప్రతి గ్రామంలోనూ నిత్యం ప్రమాదాలు జరుగుతూనే ఉంటున్నాయి.

అతి గారాబంతో అనర్థం

తల్లిదండ్రులు తమ పిల్లలను అతి గారాబం చేస్తూ, బైక్ అడిగిన తక్షణమే తాళాలు ఇస్తున్నారు. మరి కొందరు తండ్రి బైక్‌పై వెనుక కూర్చుని తమ పిల్లలతో బైక్‌లు నడిపిస్తున్నారు. ఒకొక్కసారి ఇంటిలో చెప్పకుండా పిల్లలు బైక్ తీసుకుని అతి వేగంతో నడుపుతూ ప్రమాదాలకు కారణమవుతున్నారు. బైక్‌ను నియంత్రించే సామర్థ్యం లేకపోవడంతో ఎదురుగా వచ్చే వారిని ఢీకొనడం, నేరుగా బైక్‌లను ఢీకొనడం వంటి ప్రమాదాలు జరిగి ఆసుపత్రి పాలవుతున్నారు.



మోటారు సైకిల్ నడుపుతున్న మైనర్లు

మైనర్లకు వాహనం ఇస్తే జరిమానా

కొందరు వాహనదారులు మైనర్లకు తండ్రులే వాహనాలు ఇస్తున్నారు. ఈ క్రమంలో వారు పోలీసులకు పట్టుబడితే జరిమానా విధిస్తూ ఉంటారు. ఇటీవల నూతన చట్టం అమలులోకి వచ్చింది. 304 పార్ట్ 2 కింద మైనర్ వాహనం నడిపినప్పుడు ప్రమాదం జరిగి అవతల వ్యక్తి చనిపోతే వాహన యజమాని, బాలుడితోపాటు తల్లిదండ్రులకు శిక్షకు గురవుతారు. మోటారు వాహన చట్టం 199 ఎ ప్రకారం మైనర్ల తల్లిదండ్రులు, వాహన యజమానులకు గరిష్టంగా మూడేళ్ల వరకు జైలు శిక్ష పడే అవకాశం ఉంది. అలాగే రూ.25 వేల వరకు జరిమానా విధించవచ్చు. ఏడాది పాటు సదరు వాహనం రిజిస్ట్రేషన్ రద్దు చేయడం, మైనర్‌కు 25 ఏళ్లు వచ్చే వరకు లైసెన్సు జారీ చేయకపోవడం చేస్తారు.

అరకొర దాడులతో సరిపెడుతున్న పోలీసులు



రోడ్డు ప్రమాదంలో గాయపడి మృతి చెందిన సింగవరానికి చెందిన బాలుడు అఖిల్ (ఫైల్)

నిత్యం మైనర్లు ద్విచక్ర వాహనాలతో వేగంగా వెళ్లతున్నా పోలీసులు పట్టించుకున్న దాఖలాల్లేవని ప్రజలు విమర్శిస్తున్నారు. మైనర్ విద్యార్థులు బైక్‌లపై చక్కర్లు కొడుతూ స్థానిక ప్రజలను భయాందోళనకు గురి చేస్తున్నారు.

తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇస్తాం



మైనర్లకు ద్విచక్ర వాహనాలు ఇవ్వకూడదని తెలియజేస్తూ వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇస్తాం. తరచూ నాకా బందీ నిర్వహించి మైనర్ల ద్విచక్ర వాహనాలు నడిపితే జరిమానా విధిస్తున్నాం. పిల్లలకు వాహనాలు ఇవ్వడంపై తల్లిదండ్రులు ఆలోచించాలి. ఒకొక్కసారి ప్రమాదాలు జరిగి కుటుంబాలు తేరుకోలేని విధంగా నష్టం కలగవచ్చు. మైనర్లకు వాహనాలిస్తే చట్టపరంగా తీసుకోబోయే చర్యలపై ప్రజలకు అవగాహన కల్పిస్తాం

– డి.రామ్‌కుమార్, ఎస్సై, సీతానగరం

పోలీసులు అరకొర దాడులు చేసి మమ అనిపిస్తున్నారు. సెంటర్లలో నిఘా ఉంచి అప్పుడప్పుడూ పోలీసులు జరిమానాలు విధిస్తున్నా, ఎక్కడా మైనర్లు వాహనాలు నడపడం ఆగడం లేదు. మైనర్ బైక్‌తో పట్టుపడితే ఆ వాహనాన్ని స్వాధీనం చేసుకుని తల్లిదండ్రులను పిలిపించి కౌన్సెలింగ్ ఇవ్వాలని ప్రజలు కోరుతున్నారు. ఉదయం, సాయంత్రం నిఘా ఉంచితే చాలా వరకు ప్రమాదాలను అరికట్టవచ్చు. మైనర్ల తల్లిదండ్రులను పోలీస్ స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ ఇస్తే బాగుంటుందని, కొత్తగా వచ్చిన చట్టంపై అవగాహన కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రణవ స్వరూపా.. లక్ష్మీ నరసింహా..



పుట్టకొండలో నిర్వహించిన రథోత్సవంలో భక్తజనం

పెదపూడి: పుట్టకొండ గ్రామంలో లక్ష్మీ నరసింహ స్వామి కల్యాణ రథోత్సవం శనివారం సాయంత్రం 5 గంటలకు ఘనంగా జరిగింది. రథోత్సవాన్ని ఆలయ వ్యవస్థాపకులు పీఏ అనంతాచార్యులు, గ్రామ ఉత్సవ కమిటీ ప్రతినిధులు ప్రారంభించారు. కల్యాణం సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి విశేష సంఖ్యలో హాజరైన భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఉదయం 8.10 గంటలకు నిత్యహోమం, సంప్రదాయార్చన, 12 గంటలకు ధ్వజారోహణం, బలిహరణం నిర్వహించారు. రాత్రి 10 గంటలకు గరుడు సేవ, పుష్పక వాహన సేవ చేశారు. 12 గంటలకు సముద్ర మహర్షి సంవాదం, మేళ తాళాలతో ఊరేగింపు నిర్వహించి అనంతరం తెల్లవారు జామున 4 గంటలకు(ఆదివారం) స్వామివారి కల్యాణం నిర్వహించనున్నారు. కల్యాణం, భీష్మ ఏకాదశి పర్వదినం సందర్భంగా ఉగ్ర నరసింహస్వామికి ప్రధాన అర్చకులు పి.గోపాలాచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ సర్పంచి వల్లు వెంకటరమణ, ఎంపీటీసీ సభ్యుడు డి.నారాయణరావు, మాజీ ఎంపీపీ జుత్తక సూర్యకుమారి తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి కల్యాణం



బూరుగుపూడిలో భద్రకాళీసమేత వీరేశ్వరస్వామి కల్యాణ వేడుకల్లో పాల్గొన్న భక్తులు

మధురపూడి: కోరుకొండ మండలం బూరుగుపూడిలోని భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి కల్యాణం శనివారం రాత్రి వేడుకగా నిర్వహించారు. పండితుల మంత్రోచ్ఛరణ నడుమ వీరేశ్వర స్వామికి, అమ్మ వారికి కల్యాణం వైభవంగా నిర్వహించారు. మంగళ స్నానాలు ఆచరించిన తర్వాత వరుడు, వధువుల అలంకరణలో స్వామి అమ్మవార్లు పెళ్లి పీటలపై ఆశీనులయ్యారు. ఆలయం నుంచి పల్లకీపైన భక్తులు, ఆలయ కమిటీ నాయకులు వేంచేశారు. దీనికి ముందు విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనము, పంచగవ్యం, తిశూలార్చన స్వామివారికి రుద్రాభిషేక పూర్వకంగా, అమ్మవారికి కుంకుమార్చనలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్త క్రొవ్విడి సర్రాజు, ఆయన సతీమణి రాణి, అర్చక స్వామి మానేపల్లి సుబ్బారావు కల్యాణ వేడుకలను నిర్వహించారు. ఆలయ ధర్మకర్త క్రొవ్విడి సర్రాజు ఆధ్వర్యంలో స్వామివారికి ఏటా కల్యాణ వేడుకలు నిర్వహిస్తారు. ఆలయ ధర్మకర్త సోదరులు క్రొవ్విడి సూర్యనారాయణమూర్తి, ఆలయ కమిటీ నాయకులు బూరుగుపూడి, గుమ్ములూరు గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొని కల్యాణాన్ని తిలకించారు.

ఆటో డ్రైవర్ ముసుగులో చోరీలు

- ప్రయాణికుల్ని మోసగిస్తూ బంగారం చోరీ
- సీసీ కెమెరాల ద్వారా పట్టుకున్న పోలీసులు



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ రమేష్‌బాబు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ఆటో ఎక్కిన ప్రయాణికులకు మాయ మాటలు చెప్పి వారి బంగారు ఆభరణాలు చోరీ చేస్తున్న ఆటో డ్రైవర్‌ను రాజమహేంద్రవరం ప్రకాశం నగర్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆ మేరకు సెంట్రల్ జోన్ డీఎస్పీ రమేష్ బాబు, స్టేషన్ ఇన్‌స్పెక్టర్ బాజీలాల్ శనివారం స్టేషన్ ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలు వెల్లడించారు. వివరాల్లోకి వెళితే రాజేంద్రనగర్ ప్రాంతానికి చెందిన ఓ మహిళ ఈనెల 1న ఆర్టీసీ బస్టాండ్‌లో బస్సు దిగి ఇంటికి వెళ్లేందుకు ఆటో ఎక్కింది. మార్గమధ్యలో ఆటో డ్రైవరు ఆమెకు జాగ్రత్తలు చెప్తూ, నగరంలో చోరీలు జరుగుతున్నాయి, ఒంటి మీద బంగారం ఏదీ ఉండకూడదు అని మాయ మాటలు చెప్పాడు. ఆమె చెవి దిద్దులులను తీయించి ఒక పేపర్‌లో చుట్టమని చెప్పాడు. ఆమె తన బ్యాగ్‌లో పెట్టుకొనే సమయంలో చెవి దిద్దులను దొంగిలించాడు. ఇంటికి వెళ్లి బ్యాగ్ చూసుకున్న బాధితురాలు తన బంగారు వస్తువులు ఆటో డ్రైవరే దొంగలించి ఉంటాడని గుర్తించి కుటుంబ సభ్యుల సహాయంతో ప్రకాష్ నగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేశారు. జిల్లా ఎస్పీ డి.నరసింహ కిషోర్ ఆదేశాల మేరకు సెంట్రల్ జోన్ డీఎస్పీ కె.రమేష్‌బాబు పర్యవేక్షణలో ప్రకాష్‌నగర్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఆర్ఎస్‌కే బాజీలాల్ ఆధ్వర్యంలో ఎస్సై ఎస్.శివప్రసాద్ దర్యాప్తు చేశారు. పోలీసు బృందాలుగా ఏర్పడి ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి బాధితురాలు ఇంటి వరకు మార్గమధ్యలో ఉన్న సీసీ కెమెరాల పుటేజి పరిశీలించారు. నేరం జరిగిన ఆటోను గుర్తించి నామవరం డి బ్లాక్‌కు చెందిన ఆటో డ్రైవర్ చొల్లంగి విజయ్‌కుమార్‌ను అదుపులో తీసుకున్నారు. అతడిని విచారించగా చేసిన నేరం అంగీకరించాడు. అతని నుంచి 4 గ్రాముల బంగారపు చెవి దిద్దులు స్వాధీనం చేసుకున్నారు. నేరానికి ఉపయోగించిన ఆటోను సీజ్ చేసారు. అతడిపై 2019లో బొమ్మూరు స్టేషన్ లో ఇదే తరహా కేసు నమోదైనట్టు సీఐ బాజీలాల్ తెలిపారు. కేసు దర్యాప్తులో ప్రతిభ కనపరిచిన, ఇన్‌స్పెక్టర్ ఆర్ఎస్‌కే. బాజీలాల్, ఎస్సై శివప్రసాద్, హెచ్‌సీ ఎస్.రాంబాబు, పీసీలు కే.ప్రదీప్ కుమార్, ఎస్ వీరబాబును జిల్లా ఎస్పీ అభినందించారు.

ఘనంగా సత్తెమ్మతల్లి వార్షికోత్సవం

రంగంపేట: మండల పరిధిలోని పెదరాయవరం గ్రామంలో కొలువైన సత్తెమ్మతల్లి వార్షికోత్సవం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా జరిగింది. స్థానిక రైతులు, గ్రామస్తులు, భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయం వద్ద సుమారు 5వేల మంది భక్తులకు అన్న సమారాధన నిర్వహించారు. గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువులతో భూసారం వృద్ధి

రాజానగరం: కలవచర్ల కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే)లో పులియబెట్టిన సేంద్రియ ఎరువులపై రైతులకు శనివారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లాకు చెందిన గాయత్రీ ఇన్నోవేటివ్ ఎనర్జీ సంస్థ సహకారంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కేవీకే ప్రధానాధికారి డాక్టర్ వీఎస్‌జీఆర్ నాయుడు మాట్లాడుతూ సేంద్రియ ఎరువుల వినియోగం మన దేశంలో పూర్వీకుల నుంచి ఉందన్నారు. ఆధునిక కాలంలో వీటిని విస్మరించి, రసాయన ఎరువుల వైపు రైతులు మరలడం వల్ల భూసారం దెబ్బతినడమే కాకుండా ఆరోగ్యకరమైన ఆహార పంటలను పొందలేకపోతున్నామన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ఆరోగ్యకరమైన ఆహార పంటలను పండించడంతోపాటు సారవంతమైన భూమిని భావితరాలకు అందించాలంటే సేంద్రియ ఎరువుల వినియోగాన్ని ప్రోత్సహించడం ఎంతో ముఖ్యమన్నారు. దీని వల్ల వ్యవసాయంలో ఖర్చులను ఆదా చేయవచ్చని చెప్పారు. పులియబెట్టిన సేంద్రియ ఎరువుల వల్ల కలిగే ఉపయోగాలను గాయత్రీ ఇన్నోవేటివ్ ఎనర్జీ సంస్థ ప్రతినిధులు సత్యనారాయణ, శ్రీకాంత్ రైతులకు వివరించారు. ఈ విషయమై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇస్తున్న సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కేవీకే అధికారులు రఘునందన్, డాక్టర్ నాగేశ్వరరెడ్డి, డాక్టర్ రవీంద్ర సొంటెక్కే, సంజయ్ హెగ్డే, రైతులు పాల్గొన్నారు.

గోవిందనామంతో మార్మోగిన గొల్లల మామిడాడ

పెదపూడి: భీష్మ ఏకాదశిని పురస్కరించుకొని గోవింద నామ స్మరణతో గొల్లల మామిడాడ మార్మోగింది. ఉష, ఛాయ, పద్మిని, సౌంజ్ఞ సమేత శ్రీ సూర్య భగవానుని కల్యాణం శనివారం రాత్రి కన్నుల పండువగా జరిగింది. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య స్వామి కల్యాణం నిర్వహించారు. స్వామివారి దర్శనానికి ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశారు. జిల్లా నలు మూలల నుంచి వేల సంఖ్యలో వచ్చిన భక్తులు దర్శనం కోసం బారులు తీరారు. స్థానిక మార్కెట్ సెంటర్ వద్ద అన్నదానం నిర్వహించారు. ఉత్సవ కమిటీ ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు. మధ్యాహ్నం 1.05 గంటలకు రథోత్సవాన్ని వ్యవస్థాపక వంశ పారంపర్య ధర్మకర్త కొవ్వూరి బాలకృష్ణారెడ్డి, ఆలయ ఉత్సవ కమిటీ ప్రతినిధులు ప్రారంభించారు. ఎంపీపీ కేతా తులసి, వైస్ ఎంపీపీ ద్వారంపూడి పద్మారెడ్డి, ఎన్డీఏ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీనివాసుని కల్యాణం

బిక్కవోలు: పందలపాక వెలంపేటలో కొలువైన అలమేలు మంగ, పద్మావతీ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద శనివారం స్వామివారి కల్యాణం నిర్వహించారు. భీష్మ ఏకాదశిని పురస్కరించుకొని నిర్వహించిన కల్యాణ ఘట్టానికి లగుడు బాపిరాజు, దుర్గాభవాని దంపతులు కర్తలుగా వ్యవహరించారు. ఈ కల్యాణాన్ని భారీ సంఖ్యలో మహిళలు తిలకరించారు. బ్యాంక్ వీధిలో కొలువైన వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద కల్యాణం నిర్వహించారు. రెండు చోట్లా అన్న సమారాధనలు నిర్వహించారు.



చిన్నారుల కోలాటం

ఆలయాల్లో హరినామ స్మరణ

రాజానగరం: భీష్మ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని నియోజకవర్గంలోని వైష్ణవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. వేంకటేశ్వరస్వామి, రామాలయం, కృష్ణాలయాలలో భక్తులు స్వామివార్లను దర్శించుకుని, మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక అగ్రహారం, ఫరిజల్లిపేట, కానవరం, తోకాడ, మల్లంపూడి, వెలుగుబంద, చక్రద్వారబంధం, రాదేయపాలెం, తుంగపాడు, సంపత్‌నగరం, శ్రీరామపురం, పాలచర్లలోని రామాయాలు, రాజానగరం, దివాన్‌చెరువులోని వేంకటేశ్వర స్వామి ఆలయాల్లో భక్తులు భజనలు చేశారు.




సూర్య భగవానుని కల్యాణోత్సవం నిర్వహిస్తున్న వేదపండితులు

ప్రత్యేక పూజలు

మధురపూడి: భీష్మ ఏకాదశిని పురస్కరించుకొని శనివారం కోరుకొండ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి దర్శనం నిమిత్తం సుదూర ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో రావడంతో ఆలయంలో రద్దీ నెలకొంది. కోరుకొండ మండలం బూరుగుపూడి బాబామందిరంలో 108 సార్లు విష్ణు సహ సహస్రపారాయణ చేశారు. సాయి సేవకులు, భక్తులు పాల్గొన్నారు.

నులి పురుగులను నిర్మూలిద్దాం



రంగంపేట హైస్కూల్లో ఆల్బెండజోల్ మాత్రలు అందిస్తున్న వైద్య సిబ్బంది

రంగంపేట: నులి పురుగులను నిర్మూలిద్దామని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు వేణు శ్రీలక్ష్మి పేర్కొన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 10వ తేదీన మండల వ్యాప్తంగా నిర్వహించనున్న జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. రంగంపేట, సింగంపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలు, అంగన్వాడీ కేంద్రాల్లో ఈ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. నులి పురుగులను నిర్మూలించే అల్బెండజోల్ మాత్రలను చిన్నారులు, విద్యార్థులతో తినిపించాలన్నారు. వీరందరికీ మాత్రలు అందించడం జరిగిందన్నారు.

విద్యార్థుల అభ్యసన ఫలితాలకు ప్రాధాన్యమివ్వాలి

రాజానగరం: ప్రాథమిక తరగతుల్లో విద్యార్థుల అభ్యసన ఫలితాలకు ప్రాధాన్యమివ్వాలని జిల్లా సమగ్ర శిక్ష అకడమిక్ మోనిటరింగ్ అధికారి (ఏఎంఓ) డి.గౌరీశంకర్రావు ఉపాధ్యాయులకు సూచించారు. మండలంలోని కొండగుంటూరు, పాలిటెక్నిక్ కళాశాలలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల్లో ఒకటి, రెండు తరగతులు బోధించే ఉపాధ్యాయులకు ఆరు రోజులుగా నిర్వహించిన 9వ బ్యాచ్ పునాది అభ్యసన శిక్షణ తరగతులు శనివారం ముగిశాయి. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో వారం రోజుల శిక్షణలో భాగంగా బోధనోపకరణాల (టీఎల్ఎం) తయారీలో ప్రతిభ చూపిన ఉపాధ్యాయులకు జ్ఞాపికలను అందజేశారు. అల్లూరి సీతారామరాజు జిల్లా నుంచి 168 మంది, కాకినాడ జిల్లా 95 మంది, తూర్పుగోదావరి జిల్లా నుంచి 15 మంది చొప్పున 278 మంది ఒకటో తరగతి బోధించే ఉపాధ్యాయులు శిక్షణ పొందారు. ఎంఈఓలు రామకృష్ణ, వై.నాగేశ్వర్రావు, డైట్ లెక్చరర్ రాజేష్, ప్రథమ్ డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ కె.అనూష, సతీష్, కేఆర్పీలు, డీఆర్పీలు, పాల్గొన్నారు.

అలరించిన ఏకాహం

సీతానగరం: మండల గ్రామాల్లో పలు ఆలయాల వద్ద ఏకాహం కార్యక్రమాలు నిర్వహించారు. శనివారం భీష్మ ఏకాదశి సందర్భంగా పలు ఆలయాల వద్ద భక్తుల రద్దీ నెలకొంది. సీతానగరం విష్ణాలయంలో రుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాల స్వామిని భక్తులు దర్శించారు. రాపాకలోని బసవేశ్వరుడు ఆలయం వద్ద స్వామికి ప్రత్యేక పూజలు చేసి ఏకాహం నిర్వహించారు. ఉదయం 6 గంటల నుంచి ప్రారంభమైన ఏకాహం భజన కార్యక్రమం 24 గంటలపాటు కొనసాగించారు. భక్తులు స్వామివారిని దర్శించి పూజలు చేశారు. వంగలపూడి సీతారామాలయం వద్ద స్వామివారిని భక్తులు దర్శించారు. మండల గ్రామాల్లోని ఆలయాల వద్ద ఏకాహం కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు

కార్యకర్తలే వైఎస్సార్ సీపీకి అండ

వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జక్కంపూడి రాజా

మధురపూడి: వైఎస్సార్ సీపీకి కార్యకర్తలే అండని, వారికి ఎల్లప్పుడు చేదోడుగా ఉండటంలో జక్కంపూడి కుటుంబం ముందుంటుందని వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. కోరుకొండ మండలం పలు గ్రామాల్లో ఇటీవల అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారిని, పలువురు మృతి చెందడంతో వారి కుటుంబాలను శనివారం ఆయన పరామర్శించారు. ఆయా కుటుంబాలకు భరోసానిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల్లో పార్టీకి ప్రజాదరణ అధికమవుతోందన్నారు. ఆ ఉత్సాహంతో మరింత దూసుకువెళ్తామన్నారు. తొలుత జంభూపట్నంలో అనారోగ్యంతో బాధపడుతున్న ఉల్లి పట్టాభిరామన్న, గుర్రాల నాగేశ్వరరావును పరామర్శించారు. స్థానిక గుమ్ములూరులో ఇటీవల ఈర్ల అంజి, జెట్టి ఉమామహేశ్వరరావు మృతి చెందారు. ఆయా కుటుంబాలకు చెందిన వారిని రాజా పరామర్శించి, తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఆయన వెంట కోరుకొండ జెడ్పీటీసీ కర్రి నాగేశ్వరరావు ఉన్నారు.



జంభూపట్నంలో పట్టాభిరామన్నను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

కూటమి ప్రభుత్వంపై పెరుగుతున్న ప్రజా వ్యతిరేకత



పార్టీ అనుబంధ కమిటీ అధ్యక్షులను సత్కరిస్తున్న డాక్టర్ గూడూరి శ్రీనివాస్



దుర్గారెడ్డిని సత్కరిస్తున్న డాక్టర్ గూడూరి

రాజానగరం: రాష్ట్రంలో అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వ పాలనా తీరుపై ప్రజలు విసిగిపోతున్నారని, ఎన్నికల హామీలు అమలు చేయకపోవడంతో చంద్రబాబుపై ప్రజావ్యతిరేకత పెరుగుతోందని వైఎస్సార్ సీపీ రాజమండ్రి పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్ అన్నారు. ఇదే సమయంలో ప్రజలను కలుసుకుని, ముచ్చటిస్తూ జగన్న ప్రభుత్వంలో అమలు చేసిన ప్రజా సంక్షేమ పథకాలను గుర్తు చేయడం ద్వారా జానాభిమాన్ని చూరగొనవచ్చని క్యాడర్‌కి ఆయన సూచించారు. పార్టీ అనుబంధ కమిటీ అధ్యక్షులుగా నియమితులైన రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గం నుంచి పడాల వీరరాఘవరెడ్డి (ఆర్టీఐ), అనపర్తి నియోజకవర్గ నుంచి దుర్గారెడ్డి (యువజన విభాగం) తమ అనుయాయులతో డాక్టర్ శ్రీనివాస్‌ని దివాన్‌చెరువులో శనివారం కలుసుకుని, దుశ్శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా వారిని కూడా దుశ్శాలువాలతో గూడూరి శ్రీనివాస్ సత్కరించి, అభినందించారు. ఆయా ప్రాంతాల్లో పార్టీని మరింత బలోపేతం చేయడంలో తీసుకోవలసిన చర్యలపై దిశనిర్దేశం చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు బొప్పన సుబ్బారావు, ఇబ్రహీం భాషా, కోదాటి సంతోష్‌కుమార్, కలిశెట్టి వెంకటేష్, సబ్బెళ్ల కృష్ణారెడ్డి, పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ సమన్వయకర్త గూడూరి శ్రీనివాస్‌ను కలిసిన దుర్గారెడ్డి

పెదపూడి: అనపర్తి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ యువజన విభాగం అధ్యక్షునిగా నియమితులైన పడాల దుర్గారెడ్డి రాజమహేంద్రవరం పార్లమెంటు నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌ను శనివారం మర్యాద పూర్వకంగా కలిసి ధన్యవాదాలు తెలిపారు. అనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి, వైఎస్సార్ సీపీ యువజన విభాగం నాయకులు నల్లమిల్లి నాగార్జునరెడ్డి, పులగం చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.